1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | జులై 21, 2024 | www.navatelangana.com

ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని మున్యాల ఉన్నత పాఠశాలలో శనివారం ఇటీవల ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన ముగ్గురు విద్యార్థులను పాఠశాల తరపున శాలువాతో సన్మానించారు. అనంతరం పదవి కాలం ముగిసిన ప్రజాప్రతినిధులను గ్రామస్థులు, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సింగారి కిషన్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివించే విధంగా పిల్లల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రైతులు పంట వివరాలు నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

రైతులు పంట వివరాలు నమోదు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి కుంట మౌనిక అన్నారు. శనివారం వానాకాలంలో రైతులు సాగుచేస్తున్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొక్క జొన్న, పత్తి రైతులకు అధిక దిగుబడుల నిమిత్తం పలు సూచనలు చేశారు. అనంతరం పంటల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో రైతులు వేసిన పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. పంట వివరాలు నమోదు చేసుకోకపోతే ధాన్యం విక్రయించే సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



ముసురేసిన వాన..!

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షం
- పలు చోట్ల ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు
- కడెంకు చేరుతున్న వరద నీరు..హెచ్చరిక జారీ
- ఓసీపీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి
- మరో రెండు రోజులు కొనసాగనున్నట్లు అధికారుల వెల్లడి
- అప్రమత్తంగా ఉండాలని సూచన

ఉమ్మడి జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. శనివారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన వర్షం రోజంతా కురిసింది. కొన్ని చోట్ల ముసురేయడం..మరికొన్ని చోట్ల జోరుగా కురవడం వంటి పరిణామాలున్నాయి. విరామం లేకుండా వర్షం పడటంతో జనజీవనం స్తంభించిపోయింది. ఇంట్లో నుంచి కాలు బయట పెట్టనీయలేని పరిస్థితి ఉంది. మరోపక్క ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పలు చోట్ల పంట పొలాలు నీట మునిగాయి. పై నుంచి వచ్చిన వరదతో వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కడెం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 5500క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఏ క్షణంలోనైనా గేట్లు ఎత్తివేసే అవకాశం ఉండటంతో పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక జారీ చేశారు. మరోపక్క వర్షాల నేపథ్యంలో జిల్లావాసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉన్నతాధికారులు సైతం సూచిస్తున్నారు. తక్షణ సహాయ చర్యలకు డీడీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు చెబుతున్నారు.



సాంగిడి - ఉమ్రి గ్రామాల మధ్య కొట్టుకుపోయిన రోడ్డు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాను వర్షాలు ముంచెత్తుతున్నాయి. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిక కూడా జారీ చేసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్రలోనూ వానలు కురుస్తున్నందున ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగులు దాటలేక జనాలు ఆయా గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇన్నాండ్లు జోరు వర్షాలు లేక వెలవెలబోయిన జలాశయాలు కొత్త నీటి రాకతో కళకళలాడుతున్నాయి. చెరువులు, కుంటలు నిండుకున్నాయి. సాత్నాల, మత్తడివాగు, స్వర్ణ, ఎల్లంపల్లి, కుమురంభీం(అడ) తదితర ప్రాజెక్టుల్లోకి వరదనీరు చేరుకుంటోంది. ఆసిఫాబాద్ జిల్లాలో పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించడం కారణంగా అందవెల్లి వద్ద నిర్మించిన అప్రోచ్ రోడ్డు కుంగిపోయింది. రాకపోకలు నిలిచిపోయాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. పెంచికల్‌పేట్ మండలం బొంబాయిగూడ ఎస్సీ కాలనీలో ఓ ఇల్లు కూలిపోయింది. కుంటాల,పొచ్చెర, గాయత్రి తదితర జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి.



పెంచికల్‌పేట్‌లో కూలిన ఇల్లు

నేడూ భారీ వర్షాలు..!

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మరో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతున్నారు. ఆదివారం సైతం భారీ వర్షం కురుస్తుందని వాతావరణశాఖ చెబుతుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం.. ఇండ్లలోకి వరద నీరు చేరడంతో పాటు నదులు, వాగులు మరింత ఉగ్రరూపం దాల్చే అవకాశం ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేస్తున్నారు. వాటి పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో కీలకమైన నదులుగా భావించే గోదావరి, ప్రాణహిత, వార్ధా, పెన్‌గంగా నదులకు వరద ప్రవాహం పెరుగుతోంది. జిల్లాతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చాలా చోట్ల లోతట్టు ప్రాంతాల్లో ఇండ్లలోకి వర్షపు నీరు చేరడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి శ్రీరాంపూర్ ఏరియాలోని ఓసీపీల్లో నీరు చేరింది. దీంతో సుమారు 36వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయిందని సింగరేణి అధికారులు తెలిపారు.



ఇంద్రవెల్లి మండలంలో ప్రమాదకరంగా వాగు దాటుతున్న వైద్య సిబ్బంది

నీటి మాటలైన కాంగ్రెస్ వాగ్దానాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల్లో చేసిన కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలన్నీ నీటి మాటలయ్యాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఎద్దేవా చేశారు. శనివారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ వెంటనే చేయాలన్నారు. ఎటువంటి ప్రణాళిక లేకుండా రైతులను గందరగోళానికి గురయ్యేలా చేస్తూ రుణమాఫీ తతంగాన్ని నడిపిస్తున్న ప్రభుత్వం వెంటనే రైతుల అనుమానాలను నివృత్తి చేయాల్సి ఉందని తెలిపారు. రుణమాఫీ పథకాన్ని స్వాగతిస్తున్నప్పటికీ, పలుచోట్ల అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని అన్నారు. వెంటనే అధికారులు ఈ విషయంలో చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్, వ్యవసాయ, మండల కార్యాలయాల్లో హెల్ప్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చి రైతుల అనుమానాలు తీర్చాలని అన్నారు. సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దయాకర్, బిజెపి నాయకులు ఆదినాథ్, ఆకుల ప్రవీణ్, మయూరి చంద్ర, దినేష్ మాటోలియా, కృష్ణ యాదవ్, రాజేష్, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం



నవతెలంగాణ-నిర్మల్

లక్ష్మణచాంద మండలం ధర్మారం అంగన్వాడి కేంద్రంలో ఐదవరోజు అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతిదేవి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. రెండున్నర సంవత్సరాలు దాటిన పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని అంగన్వాడీ టీచర్ గీత కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ భాగ్యలక్ష్మి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం హేమలత, ఆయా మమత, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్‌లో గురు పౌర్ణమి వేడుకలు



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువు చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ప్రధానోపాధ్యాయులు కొండ రాజేంద్రగౌడ్ వ్యాస పౌర్ణమి విశిష్టత గురించి తెలియజేశారు. గురువు అంటే అజ్ఞాన్ని తొలగించి జ్ఞానం అనే వెలుగులోకి తీసుకెళ్లేవాడని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు మంచి సంస్కృతి క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షాకాలం జాగ్రతలు పాటించాలి

నవతెలంగాణ-నార్నూర్

వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎంపిడిఓ జవహర్‌లాల్, తహసీల్దార్ రాజలింగం సూచించారు. మూడు రోజుల నుండి వర్షం కురుస్తున్న నేపథ్యంలో మలంగి గ్రామ పంచాయతీ పరిధిలోని బారిక్‌రావ్ గూడను సందర్శించారు. ఆ గ్రామానికి వెళ్లే మార్గంలో వాగు ఉండడంతో ఉప్పొంగినప్పుడు దాటి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని గ్రామస్థులకు సూచించారు. వర్షంలో గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ వాగులో బట్టలు ఉతుకుతుండడంతో గమనించిన అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వారి వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

31న హెడ్ క్వార్టర్స్‌లో వస్తువుల వేలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న వస్తువులను ఈ నెల 31న వేలం వేయనున్నట్లు ఎస్పీ గౌస్ ఆలం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో సర్వీస్‌లో లేని కంప్యూటర్స్, ప్రింటర్స్, కిట్ ఆర్టికల్స్, పాతబడిన టెంట్లు, ఇనుప సామాగ్రి, స్టోర్ వస్తువులను విక్రయించేందుకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేలంలో పాల్గొనడానికి ఆసక్తి గల కొనుగోలుదారులు జులై 31న ఉదయం 10 గంటలకు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు ఆధార్ కార్డుతో రావాలని పేర్కొన్నారు. ఇతర సమాచారం కొరకు ఆర్ఐ అడ్మిన్ ఎ.నవీన్ ఫోన్ నెంబర్ 8712659933ను సంప్రదించాలని పేర్కొన్నారు.

గంటపాటు పర్యటించి..సమస్యలు తెలుసుకొని

- ఐటిఐ కళాశాలను సందర్శించిన కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలను కలెక్టర్ రాజర్షి షా సందర్శించారు. దాదాపు గంటపాటు కళాశాలలో పర్యటించి ప్రతి గదిలో తిరుగుతూ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రొడ్డ శ్రీనివాస్‌ను ప్రతిదీ అడిగి క్షుణ్ణంగా ఓపికతో తెలుసుకున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, కుట్టు మిషన్, స్టెనోగ్రాఫర్ గదులను, కోర్సుల వివరాలు, హాజరవుతున్న విద్యార్థుల రిజిష్టర్‌లను పరిశీలించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. కళాశాలలో కోర్సులు అందుబాటులో ఉన్నప్పటికీ రెగ్యులర్ ఫ్యాకల్టీ అందుబాటులో లేదన్నారు. ప్రస్తుత ఫ్యాకల్టీకి రెండు, మూడు నెలల నుండి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కళాశాలలో లికేజీలు అవుతున్నాయని ఇతర సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో కలెక్టర్ ఓపిగ్గా విని నూతన బిల్డింగ్ ఏర్పాటు చేద్దామా.. దీన్నే రిపేర్ చేయిద్దామా అంటూ మాట్లాడారు. ఆర్అండ్‌బి అధికారులను కళాశాలకు పంపి కళాశాల భవన స్థితిగతులను చూడమని చెప్తామని కలెక్టర్ తెలిపారు. రిపేర్ చేయించక ఎన్ని సంవత్సరాలు నిలకడగా ఉంటుందో లేదో తెలిశాక నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.



నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డిపై అవాకులు, చెవాకులు పేలితే ఉపేక్షించేదిలేదని, నోరు అదుపులో పెట్టుకుని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడాలని, లేనిపోని ఆరోపణలు చేస్తే ఖబడ్దార్ అంటూ ఆ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు ఎంఏ.షకిల్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు కంది శ్రీనివాసరెడ్డి, బల్దియా మాజీ వైస్ చైర్మెన్ జహీర్ రంజానిపై చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, ఆయన కొడుకుల్లాగా కమీషన్లు తీసుకోవడం, భూకబ్జాలు చేయడం, సెటిల్‌మెంట్లు చేయడం, అవినీతి, అక్రమాలకు పాల్పడడం కంది శ్రీనివాసరెడ్డికి తెలియదని అన్నారు. డబ్బులు తీసుకుని బదిలీలు చేయించడం ఎరుగరన్నారు. కష్టపడి సంపాదించిన డబ్బులతో పేదలకు సాయం అందించడం, సేవలు చేయడమే ఆయనకు తెలిసిన నీతి అన్నారు. బీఆర్ఎస్ నాయకులు మరోసారి లేనిపోని విమర్శలు చేస్తే ఊరుకునేదిలేదన్నారు. సమావేశంలో కౌన్సిలర్ జాఫర్ అహ్మద్, నాయకులు షేక్ కలీం, ఖయ్యూం, అమ్జత్, అయాజ్, నసీంఖాన్, అతిక్ పాల్గొన్నారు.

ఎనలేని సేవలందించిన సీఆర్ఆర్

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రథమ వర్ధంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాజీ మంత్రిగా, ఎమ్మెల్యేగా జిల్లాకు ఎనలేని సేవలందించిన మహనీయుడు స్వర్గీయ చిలుకూరి రామచంద్రారెడ్డి అని కాంగ్రెస్ నాయకులు డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శనివారం ఆయన ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని ప్రజాసేవ భవనంలో రాంచందర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నిరుపేదలకు రిమ్స్ నిర్మాణం ఆయన హయాంలోనే జరిగిందన్నారు. జిల్లాలో మత్తడి వాగు లాంటి అనేక ప్రాజెక్టులు, రోడ్లు, పేదలకు ఇండ్లు కట్టించిన పేదదల పెన్నిధి అని కొనియాడారు. నియోజకవర్గంలోనే కాకుండా జిల్లాలో కూడా ఎన్నో మంచి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. పేదలకు



25వేల ఇందిరమ్మ ఇండ్లతో పాటు దాదాపు 40 వేల మందికి ప్లాట్లు అందించిన ఘనత సీఆర్ఆర్‌దే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, కౌన్సిలర్లు రాంకుమార్, జాఫర్ అహ్మద్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ ఇజ్జగిరి సంజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ బిక్కి గంగాధర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఆత్రం సుగుణక్క



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బంగారుగూడలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనంద్‌రావు మేనత్త భగీర్తాబాయి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకొని ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి శనివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుమారులు సీతయ్య, గంగారాం, పరుశురాం పటేల్‌తో మాట్లాడి ఓదార్చారు. అంకోలి గ్రామ కాంగ్రెస్ కార్యకర్త తల్లి లసుంబాయి, అదే గ్రామానికి చెందిన రైతు బండి నర్సిములు, కాంగ్రెస్ కార్యకర్త చంద్రకాంత్‌రెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి ఇండ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు మంచాల మల్లయ్య యాదవ్, పోతన్న యాదవ్, సోమన్న యాదవ్, రమేష్ పటేల్, చారి, అఫ్రోజ్, సుధాకర్‌గౌడ్, మేస ఎల్లయ్య, లక్ష్మారెడ్డి, చిన్నస్వామి, బడుగు గంగన్న, మెంతెపు నగేష్, మేస రమేష్, మేస్రం రవి, ఎల్టీ భోజారెడ్డి ఉన్నారు.

స్వర్ణ ప్రాజెక్టులో పెరిగిన నీటిమట్టం

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు సామర్థ్యం 1183 అడగులకుగాను రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి శనివారం 1174.2 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు ఎక్కువగా పడే అవకాశం ఉన్నందున రాత్రికి స్వర్ణ ప్రాజెక్టు వరద గేట్ల నుండి నీరు వదిలే అవకాశం ఉన్నంది. నదీ పరివాహక ప్రాంతంలోనీ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండలని నీటి పారుదల అధికారులు కోరారు. ప్రజల వద్ద వరదల నేపథ్యంలో సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. జలర్లు చేపల కోసం వెళ్లొద్దన్నారు.

సీపీఐ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సిరికొండ



మండల కేంద్రంలో శనివారం సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి సమక్షంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా మహబూబ్ ఖాన్, కో కన్వీనర్‌గా బొడ్డు నవనీత, స్వర్ణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తూ, సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుంటాల రాములు, గోవర్ధన్, గోదావరి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి



నవతెలంగాణ-సారంగాపూర్

పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఎంఈఓ మధుసుధన్ అన్నారు. శనివారం మండలంలోని చించోలి(టి) ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థుల ప్రగతి, పాఠశాల అభివృద్ధి, మధ్యాహ్న భోజనం అమలు తీరు, విద్యార్థుల హాజరు శాతం పెరుగుదల, మన ఊరు-మన బడి మొదలగు వాటి గురించి చర్చించారు. బడిలో నేర్చుకున్న సామర్థ్యాల సాధన కోసం ఇంటింటా చదువుల పంట యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఉపయోగించాలని ఈ సందర్భంగా పోషకులకు ఆయన సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులకు డా.రాజశేఖర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేసి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ రమేష్, హెచ్ఎం లింగన్న, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అపోలో డయాగ్నస్టిక్ సెంటర్‌ను ప్రారంభించిన శ్యామ్ నాయక్

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ అజ్మీరా శ్యామ్ నాయక్ శనివారం ప్రారంభించారు. గిరిజన మండలం అయిన ఉట్నూర్‌లో డయాగ్నస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గిరిజనులకు నాణ్యమైన సేవలను అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు సూచించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ బాట



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని కౌట్ల(బి)గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. రెండున్నర సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ స్కూల్‌కు పంపించాలని పిల్లల తల్లిదండ్రులకు కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయగౌరి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు రాధ, అన్నపూర్ణ, రాధ, జ్యోతి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేదం పాఠశాలలో వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-బోథ్

మండలకేంద్రంలో వేదం పాఠశాలలో గురుపూర్ణిమ ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు, పిల్లలకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి విశ్రాంత ఉపాధ్యాయుడు రమేష్ బాబు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనరల్ నాలెడ్జ్ పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డాక్టర్ బిఎస్ రావు ఫౌండేషన్, అడ్వకేట్ గండ్ర మోహన్ రావు సౌజన్యంతో బీసీ స్టడీ సర్కిల్‌లో అభ్యర్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. శనివారం పట్టణంలో స్టడీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.లక్ష విలువగల జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను 200 మంది లైబ్రరీ, స్టడీ హాల్ విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థుల నైపుణ్యాలు పెంచుకోవడం వల్ల ఉద్యోగాలు సాధిస్తారని తెలిపారు. దేశ భవిష్యత్తు విద్యార్థులని తెలియజేశారు. కార్యక్రమంలో బీసీ అభివృద్ధి అధికారి కే.రాజలింగు, రిటైర్డ్ ప్రొఫెసర్ సల్ల విజయ్ బాబు, బీసీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దత్తు, కలాల శ్రీనివాస్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

మూడు రోజులు పోచ్చర జలపాతం బంద్



నవతెలంగాణ-బోథ్

మూడు రోజులు భారీవర్షాల సూచనల మేరకు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరద రావడంతో పోచ్చర జలపాతం జలకళ సంతరించుకుంది. జలపాతం అందాలు చూడడానికి పర్యాటకులు భారీగా వచ్చే అవకాశం ఉన్నందున జలపాతం వద్ద అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిరోధించేందుకు శనివారం నుంచి ఈనెల 22 వరకు జలపాతం రోడ్డును మూసివేసినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్ తెలిపారు.

పేదింటి ఆడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మీ పథకం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- త్వరలో తులం బంగారమిస్తాం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పేదింటి ఆడపడుచులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం వరమని, పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 16 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్బండవర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని, గతంలో వరంగల్ డిక్లరేషన్ సభలో ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం నేడు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రూ.లక్షలోపు రుణాన్ని మాఫీ చేసిందని తెలిపారు. రైతుల గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. త్వరలో రూ.లక్షతో పాటు తులం బంగారం అందజేస్తామని హామీ ఇచ్చారు. వర్ష కాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ప్రవీణ్, డీటీ రమేష్ నాయక్, వేణు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉచిత శిక్షణతో స్వయం ఉపాధి పొందాలి

ఈపోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో హెల్ప్ విల్ ఫౌండేషన్, న్యాక్ సహకారంతో శిక్షణ పొందిన యువతులకు ఉచిత కుట్టు మిషన్, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. మహిళలు, యువతులు పురుషులతో సమానంగా పోటీ పడాలన్నారు. మహిళలు ఇంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. పట్టుదల కష్టపడేతత్వం ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా సాధించగలమని తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రతి హక్కును వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పాటు పడుతుందన్నారు. కార్యక్రమంలో హెల్ప్ విల్ ఫౌండేషన్ సభ్యులు, న్యాక్ సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ సంఘం మండల అధ్యక్షులు సోన్ కాంబ్లే మానోహర్, మహిళలు పాల్గొన్నారు.

మహిళలు లక్ష్యాలను అధిగమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

- కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళా సంఘాల ద్వారా ఐదు సంవత్సరాలలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ప్రణాళిక బద్ధంగా చేరుకుని జిల్లాలోని మహిళలు లక్ష్యాలను అధిగమించి జిల్లాకు మంచి పేరు తేవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్, పౌల్ట్రీలపై జిల్లా సమైఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లను, పౌల్ట్రీల ఏర్పాట్లు చేయాలన్నారు. మైక్రో ఎంటర్ ప్రయిజెస్, మీ సేవా కేంద్రాలు, స్టిచింగ్, మహిళా శక్తి క్యాంటీన్ గురించి మహిళా సమైక్య సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. పౌల్ట్రీ మదర్ యూనిట్లు వివరాలపై సమీక్షించారు. జిల్లా, మండల, గ్రామాల వారీగా మహిళా సమైక్య సంఘాల గ్రూప్‌లను ఎక్కువగా ఏర్పాటు చేయాలన్నారు. మొబైల్ హోటల్స్, బస్టాండ్ సమీపంలో, జనాలు ఎక్కువగా రద్దీ ఉన్న చోట గుర్తించి క్యాంటీన్‌లు ఏర్పాటు చేసుకొని మంచి నాణ్యతతో కూడిన ఆహారం తయారుచేయాలన్నారు. అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ ద్వార చేపడుతున్న నిర్మాణ పనులను, ప్రతి మూడవ శనివారం తల్లిదండ్రులతో సమావేశాలు, తదితర వాటిపై అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ ఎప్పటికపుడు పర్యవేక్షిస్తూ ఉండాలనీ, విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సాయన్న, డీపీఎం, ఏపీఎం, మహిళా సమైక్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సిడాం శంభుకు పలువురి నివాళులు

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని మత్తడిగూడాలో ఆదివాసీ హక్కుల ఉద్యమ నాయకులు సిడాం శంభు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని ఆయన సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం ప్రొ.హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజబేత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకులు దుర్వ సంతోష్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆదివాసీ శంభు అడుగు జాడల్లో ముందుకు కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పంద్ర జైవంత రావు, తుండెబ్బ జిల్లా అధ్యక్షులు పుర్క బాపురావు, నాయకులు, ఆదివాసులు పాల్గొన్నారు.

శంభుకు నివాళులర్పించిన సుగుణ

తొలితరం ఆదివాసీ ఉద్యమ నేత సిడాం శంభు పటేల్ అని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. శనివారం మండలంలోని మత్తడిగూడలో సిడాం శంభు పటేల్ 6వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుగుణక్క పాల్గొని సమాధి వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ ఆదివాసుల హక్కులే జీవితంగా భావించిన హక్కుల యోధుడు సిడాం శంభు పటేల్ అని, ఆదివాసుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆమెతో పాటు మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, కనక వెంకటేశ్వర్లు, సుమన్ బాయి, కొండరీ రమేష్ ఉన్నారు.



సిడాం శంభు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

వాగును దాటుతూ.. వైద్యం అందించి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని మారుమూల గ్రామమైన వడగావ్ పంచాయతీ పరిధిలోని జైత్రాం తండాలో శనివారం పిట్టబొంగరం పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భారీగా వర్షం, రోడ్డు సౌకర్యం లేని ఆ గ్రామానికి వాగు దాటి చేరుకున్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారినుంచి రక్తం నమూనాలను సేకరించారు. జ్వర బాధితులకు మందులను అంద జేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది రోగులకు పలు సూచనలు చేశారు. ఇంటి పరిసరాల్లో నీరు, పిచ్చి మొక్కలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దాంతో పాటు కాచి చల్లార్చిన నీటినే తాగలన్నారు. ఈ వైద్యశిబిరంలో వైద్యులు ప్రతాప్ నాయక్, ఏఎన్ఎం విజయ సుందరి పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న స్వచ్ఛంద సంస్థ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చనిపోయిన ఓ వృద్ధురాలి అంత్యక్రియలు నిర్వహించి మానవసేవే మాధవసేవ సమితి సభ్యులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని లెప్రసి కాలనీకి చెందిన కనకే లక్ష్మీబాయి(60) శుక్రవారం కుష్టు వ్యాదితో మృతి చెందింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ వృద్ధురాలు భిక్షాటన చేస్తూ జీవిస్తుంది. అయితే అంత్యక్రియలు చేయటానికి ఎవరు ముందుకు రాలేదు. ఈ సమాచారం మానవసేవే మాధవసేవ సమితి సభ్యులకు అందింది. దీంతో వారు శనివారం ఆ వృద్ధురాలి అంత్యక్రియలను తీర్పెల్లి స్మశానవాటికలో నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు పద్వార్ శ్రీనివాస్, చిందం దేవిదాస్(స్పెషల్ బ్రాంచ్ పోలీస్ కానిస్టేబుల్), కనకా నర్సింగ్, నాగన్న, మహేష్, సంజీవ్, సట్ల నాందేవ్, లెప్రసి కాలనీవాసులు పవర్ మీనా బాయి, రాములు, దేవ్ సింగ్, నరసింహులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారం కోసమే ఫోన్ ఇన్

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్



ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలను ప్రజల నుండే తెలుసుకొని దశల వారీగా పరిష్కరించెందుకు ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. శనివారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వివిధ మండలాల, గ్రామాలకు చెందిన గ్రామస్తులు, ఉద్యోగులు ఫోన్ ద్వారా ఎదురుకుంటున్న నీటి, రోడ్డు, డ్రైనేజీ, కరెంటు, భూమికి సంబందించిన, ఏజెన్సీలో మెగా డీఎస్సీ, పాఠశాలలో నెలకొన్న సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యలను సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేలా చర్యలు చెపడతామని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను తెలుసుకోవడానికి ఫోన్ ఇన్, పొద్దు పొడుపు బొజ్జన్న అడుగు మార్నింగ్ వాక్, పల్లె బాట లాంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటాని అన్నారు.

ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలు నాటాలి



నవతెలంగాణ-జైనథ్

ప్రతి ఒక్క విద్యార్థి తన పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని ప్రాథమికొన్నత పాఠశాల జామినిలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో కలిసి పాఠశాల ఆవరణలో రకరకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల సమావేశం నిర్వహించినంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటినామన్నారు. నేటి మొక్కలే రేపటి వృక్షాలన్నారు. ప్రతి మొక్కను విద్యార్థులు కాపాడాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని కోరారు. పిల్లల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మెన్ నైతం దేవుబాయి, మాజీ సర్పంచ్ పెందూర్ మోహన్, ఉపాధ్యాయురాలు జ్యోతి, జయశ్రీ, ఉపాధ్యాయులు లక్ష్మణ్, పెంటపర్తి ఊశన్న, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను రైతాంగం గమనిస్తుంది

- మాజీ మంత్రి జోగురామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రైతు వ్యతిరేక మోసాలను రైతాంగం గమనిస్తుందని రైతు భరోసా కింద అందించాల్సిన పెట్టుబడి సాయాన్ని రుణమాఫీకి మళ్లించి రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని, రుణమాఫీ ప్రక్రియలోనూ అనేక మంది రైతులకు న్యాయం జరగడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న ఆరోపించారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతుభరోసా పెట్టుబడి సాయం గురించి ప్రజాభిప్రాయ సేకరణ పేరిట ప్రభుత్వం కాలయాపన చేస్తూ ఆ నగదునే రుణమాఫీ కింద చెల్లించిందన్నారు. రైతు బంధు కింద బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఏడాదికి జిల్లాలో లక్ష అరవై నాలుగు వేల మంది రైతులకు రూ.550 కోట్ల పెట్టుబడి సాయం అందించామని, ప్రస్తుతం రైతు రుణమాఫీ పేరిట కేవలం 18,821 మంది రైతులకు ప్రభుత్వం రూ.120 కోట్ల 79 లక్షలను మాఫీ చేసిందన్నారు. అన్నదాతల సంక్షేమానికి దాదాపు పదేండ్ల కాలంలో దాదాపు రూ.పదకొండు లక్షల కోట్ల ఖర్చు చేసిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తీసుకున్న ఋణం మొత్తం మాఫీ కాకపోవడంతో చాలా మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఒకే దఫాలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుతం కాలయాపన చేయడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. గతంలో పట్టా పాసుపుస్తకం ప్రాతిపదికన రైతుభరోసా నగదు జమ చేస్తే విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకులు ప్రస్తుతం అదే ప్రాతిపదికన రుణమాఫీ చేస్తున్నారన్నారు. విద్యార్థుల పక్షాన కేటీఆర్, కేసీఆర్ గ్రూప్ ఎగ్జామ్స్‌పై చేసిన నిరసనతో ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. విద్యార్థుల ఐక్యమత్యం పట్ల కేటీఆర్ కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారని రానున్న రోజుల్లో రైతులు సైతం సంఘటితమై ఈ మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో నాయకులు రోకండ్ల రమేష్, మెట్టు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ, గండ్రత్ రమేష్, మార్శెట్టి గోవర్ధన్, సేవ్వా జగదీష్, నవాతే శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా వర్షం

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంలో గ్రామాల్లో మురుగు కాలువలు, రోడ్లు బురద మయంగా మారాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకాదటిగా కురుస్తున్న వర్షానికి ప్రజలు, పశువులు ఇంటి వద్దనే ఉండిపోయారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | జులై 21, 2024 | www.navatelangana.com

కంటి ఆపరేషన్లకు తరలింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



పట్టణంలోని కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధర్వంలో 11 మందిని కంటి ఆపరేషన్ల కోసం సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ బెల్లంపల్లి లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి మంగవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షలో అవసరం ఉన్న పేషంట్లను సొసైటీ ఖర్చులతో రవాణ, భోజనం సదుపాయం కల్పించి ఆపరేషన్లకు తరలించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆపరేషన్ చేయించికొని లబ్ధిపొందిన వారు మరి కొంతమందిని ప్రోత్సహించాలని కోరారు. కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది గోపి పాల్గొన్నారు.

ప్రమాదంలో అంగన్‌వాడీ భవనం

నవతెలంగాణ- సిర్పూర్(టి)



సిర్పూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రైల్వే స్టేషన్ స్కూల్ ప్రాంగణంలో ఉన్న అంగన్‌వాడీ భవనం ప్రమాదంలో ఉంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి స్లాబ్‌పై నుంచి నీరు గదుల్లోకి వస్తోంది. స్లాబ్ బాగా తడిసిపోవడంతో కూలిపోయే ప్రమాదం ఉంది. వర్షం కురిసిన రోజుల్లో తమ పిల్లలను కేంద్రాన్ని పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్ర భవనానికి మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

నిండు కుండల ప్రాణహిత

నవతెలంగాణ-కౌటాల



జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత నిండుకుండల ప్రవహిస్తుంది. శనివారం ప్రాణహిత నదిని తహసీల్దార్ ఇందార పుష్పలత, ఎస్సై మధుకర్ పరిశీలించారు. శుక్రవారం నుండి శనివారం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని చింతలపాటి వాగు వద్ద బ్రిడ్జికి ఆనుకొని ప్రవహించడంతో పరిశీలించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. అనంతరం ఇక్కడి నుండి తాటిపెల్లి పెన్‌గంగాను పరిశీలించి జాలరులు ఎవరు చేపల వేటకు వెళ్ళవద్దని ఆదేశించారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత సంగమం నిండుకుండలా నిండి ప్రవహిస్తుంది. వార్ధానది పెన్‌గంగా రెండు కలిసి ప్రవహించడంతో జాలరులు చేపల వేటకు వెళ్లకూడదని సూచించారు. మండలంలోని కన్నెపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం స్లాబు పెచ్చులు ఊడి కింద పడ్డాయి. ఆ సమయంలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఎస్పీని కలిసిన మాజీ ఎమ్మెల్సీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాకు నూతనంగా వచ్చిన ఎస్పీ డీవీ శ్రీనివాసరావును మాజీ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ పురాణం సతీష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు అంశాలు ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెబ్బెన మాజీ జడ్పీటీసీ సంతోష్, కాంగ్రెస్ నాయకులు గాదవేణి మల్లేష్, దీపక్ ముండే, రెబ్బెన మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు పెనుగంగ నది తీర ప్రాంత ప్రజలు, రైతులు వివిధ గ్రామాల మధ్య ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న దృశ్య అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యనారాయణ కోరారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ప్రవహిస్తున్న పెనుగంగా నది తీరక ప్రాంతంతో పాటు బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా రైతులు, చేపలు పట్టే జాలర్లు చేపల వేటకు నదిలోకి వెళ్లకుండా గ్రామస్తులకు టామ్ టామ్ ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. లోతట్టు ప్రాంతంలో నివసించే వారు, వివిధ గ్రామాల మధ్య ఉన్న వాగులు దాటే సమయంలో అప్రమత్తంగా ఉండేలాగా చూడాలని పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందికి సూచించారు. వారి వెంట ఎస్సై దీకొండ రమేష్, ఆర్ఐ జుగాడి రావు ఉన్నారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బొంబాయిగూడ గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన జోగె అంకుబాయి ఇల్లు పూర్తిగా కూలిపోయింది. కూలిన ఇంటిని తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ అల్బర్ట్ పరిశీలించారు. కొండపెల్లి గ్రామం నుండి గొల్లవాడకు వెళ్లే రహదారిపై వంతెన గత సంవత్సరం వర్షాలకు సగం ధ్వంసం కాగా గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు వంతెన పూర్తిగా తెగిపోయింది. దీంతో ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి.

ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని అన్ని ముఖ్య విద్యుత్ డివిజన్ ఆఫీస్, ఈఆర్‌ఓ, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహించనున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అయా కార్యాలయాల్లో ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో ఉద్యోగమేళా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసుల ఆధ్వర్యంలో జీఎంఆర్ కంపెనీ సహకారంతో ఉద్యోగమేళ నిర్వహించనున్నట్లు డీఎస్పీ సదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నాలుగు ప్రాంతాల్లో, బెంగళూరు, ఒరిస్సాలలోని ఒక్కొక్క ప్రాంతంలో జీఎంఆర్ కంపెనీ ఆధ్వర్యంలో 1000 సెక్యూరిటీ గార్డుల పోస్టులు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తిగల జిల్లాలోని యువత తమ దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. త్వరలోనే పోలీస్ స్టేషన్ల వారీగా జాబ్ మేళా తేదీలను ప్రకటిస్తామని, జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు

- అడ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత
- పొంగిన వాగులు నిలిచిన రాకపోకలు
- వాగులు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- ప్రత్యేక కంట్రోల్ నెంబర్ ఏర్పాటు



తుంపెల్లి వాగు వద్ద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో రెండు మూడు రోజులుగా చెదురు ముదురు వర్షాలు కురుస్తున్నప్పటికీ శుక్ర, శనివారాలు కుండపోత వర్షం కురవడంతో వాగులు పొంగడంతో పాటు రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్ డివిజన్‌లో గురువారం రాత్రి భారీ వర్షం కురియగా శనివారం కూడా జిల్లా వ్యాప్తంగా వర్షపాతం నమోదయింది. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు జిల్లాలో సగటు 8.8 మిల్లీ మీటర్ల వర్షపాతం కురియగా మండలాల వారీగా కురిసిన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జైనూర్‌లో 2.4 మీ.మీ, సిర్పూర్ (యు)లో 2, లింగాపూర్‌లో 13.6, తిర్యాణిలో 16.8, రెబ్బెనలో 14, ఆసిఫాబాద్‌లో 8.4, కెరమెరిలో 7.6, వాంకిడిలో 18.4, కాగజ్‌నగర్ లో 3.2, సిర్పూర్ (టి)లో 1.4, కౌటాలలో 0, చింతలమానపెల్లి 10.4, బెజ్జూర్‌లో 16.6, పెంచికలపేట 8, దహెగాం 9.4 మీ.మీ ల వర్షపాతం నమోదైంది.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

అడ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

రెండు రోజుల క్రితం రెండు అడ ప్రాజెక్టు గేట్లు ఎత్తి మళ్లీ మూసివేసిన అధికారులు శనివారం మధ్యాహ్నం 3 గంటల వరకు పరివాహక ప్రాంతాల్లో వర్షపాతం ఎక్కువగా నమోదు కావడంతో మూడు గేట్లను 0.3 మీటర్లు పైకి ఎత్తి 1941 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు కింద ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పొంగిన వాగులు నిలిచిన రాకపోకలు

ఓవైపు అడ ప్రాజెక్టు గేట్లు ఎత్తడం విస్తారంగా వర్షపాతం నమోదు కావడంతో జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గుండి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.



వాగు వద్ద విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది

అప్పపెల్లివాగు, బలాన్‌పూర్ వాగు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.

వాగు ప్రవాహం పరిశీలించిన అధికారులు

మండలంలోని తుంపెల్లి వాగు వద్ద ప్రవాహాన్ని కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ. శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఏఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీ సదయ్య, స్థానిక సీఐ సతీష్ పరిశీలించారు. గత సంవత్సర వర్షాకాలంలో జరిగిన సంఘటన తెలుసుకున్న కలెక్టర్ అధికారులు వాగుల వద్ద పహారతో పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని ప్రతి వాగు వద్ద ప్రజలు ప్రవాహం ఉన్న సమయంలో దాటకుండా చూడడానికి పోలీసులను బందోబస్తుగా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు.

జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో వరదలు వాగులతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండే విధంగా చూడడానికి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. కంట్రోల్ రూమ్‌ను అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీఓ లోకేశ్వరరావు, డీపీఆర్ఓ సంపత్ కుమార్, కలెక్టరేట్ ఏఓ రఫత్ హుస్సేన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ప్రజలకు రక్షణ కల్పించడానికి ప్రత్యేక ఫోన్ నెంబర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనికోసం 08733-279033, 6304686505 నెంబర్లు 24 గంటలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భారీ వర్షంతో అతలాకుతలం

- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- నీట మునిగిన పంట పొలాలు
- కుంగిన అందవెల్లి అప్రోచ్ రోడ్డు

నవతెలంగాణ - దహెగాం

మండలంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తుంది. దీంతో శనివారం ఉదయం నుండే వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని ఐనం, బీబ్రా గ్రామాల మధ్య లోలెవల్ వంతెనలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రవాణా వ్యవస్థ గంటల తరబడి నిలిచిపోతుంది. గ్రామ పంచాయతీ సిబ్బందిని లోలెవల్ కల్వర్టుల వద్ద ఉంచి ప్రయాణికులను అప్రమత్తం చేస్తున్నారు. కొందరు ప్రయాణికులు ద్విచక్ర వాహనాలను ప్రమాదకర స్థాయి నీటిలో నుండి దాటిస్తుండడంతో వాహనాలు పాడైపోతున్నాయి. అలాగే పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పంట చేన్లకు వెళ్లే రైతులు ఈ గుండా లోలెవల్ వంతెనలు దాటడానికి తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేని వర్షాల వల్ల వందలాది ఎకరాల్లో పత్తి పంట పూర్తిగా మునిగిపోయింది. దీంతో ఈ వర్షం



మరింత కుంగిపోయిన అందవెల్లి అప్రోచ్ రోడ్డు



ఐనం గ్రామం వద్ద చెరువును తలపిస్తున్న పత్తి చేను

ఇలాగే కొనసాగితే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

కుంగిన అందవెల్లి అప్రోచ్ రోడ్డు..

కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వద్ద పెద్దవాగుపై నిర్మించిన వంతెన పూర్తయినప్పటికీ అప్రోచ్ రోడ్డు పూర్తికాక తాత్కాళికంగా మట్టి పోసి అప్రోచ్ రోడ్డును నిర్మించారు. దీంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అప్రోచ్ రోడ్డు మరింత కుంగిపోయింది. గత కొన్ని రోజులుగా ఆటోలు, కార్లను అనుమతిస్తున్న అధికారులు అప్రోచ్ రోడ్డు మరింత కుంగిపోవడంతో నేడు కాలినడకన వెళ్లే వారికి, ద్విచక్ర వాహనదారులకు మాత్రమే అనుమతులు ఇచ్చి మిగతా వారిని ఎటువైపు వారిని అటువైపే నిలిపివేస్తున్నారు. దీంతో దహెగాం, భీమిని మండలాల ప్రజలకు ప్రయాణపు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. అత్యవసరమైతే కాలినడకన వెళ్లి మరో వాహనంలో కాగజ్‌నగర్ లేదా దహెగాం మండలాలకు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తుందని తెలిసి కూడా ఒక వైపు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేసినప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పూర్తిస్థాయి దృష్టి పెట్టకపోవడంపై రెండు మండలాల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా వంతెన అప్రోచ్ రోడ్డు పనులను పూర్తిచేసి రవాణా వ్యవస్థను పునః ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలి

- జిల్లా విద్యాధికారి అశోక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కట్టుబడి ఉండాలని, అదే సందర్భంలో దానిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ఎల్ఈడీ ట్యూబ్ లైట్ తయారీకి సంబంధించి ఇవ్వనున్న శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ నిత్య జీవితంలో ప్రధాన భాగం పోషిస్తుందని దాని వినియోగం రోజురోజుకు పెరుగుతుందన్నారు. విద్యుత్ శక్తి కొరతను అధిగమించడానికి విద్యార్థులు చిన్నతనం నుండి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి ప్రత్యామ్నాయ పద్ధతులను ఉపాధ్యాయులు వారికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ హరిత దళం రీజనల్ కోఆర్డినేటర్ విద్యాసాగర్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమం విద్యార్థులకు పర్యావరణంపై స్పృహను పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కోఆర్డినేటర్ కటకం మధుకర్ మాట్లాడుతూ పర్యావరణ స్పృహను పెంచడంలో పాఠశాలల్లో ఉన్న గ్రీన్ ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు నూతన విషయాలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాథోడ్ సుభాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధికి మహిళా శక్తి పథకం

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించి మహిళా శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొన్ని యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు క్యాంటీన్‌తో పాటు స్త్రీ నిధి లింకేజ్, బ్యాంకు లింకేజ్, వాటర్ షెడ్‌ల ద్వారా నిధులు సమకూర్చి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో



అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, తహసీల్దార్ తిరుపతి, ఏపీఎం సుజాత, శ్రీనివాస్, ఎంపీఓ శివకుమార్, మండల సమైక్య సీసీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వాతావరణ శాఖ భారీ వర్ష సూచన నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాగులు వంకలు నదుల వద్దకు వెళ్లకూడదని, రైతులు పొలాల్లో విద్యుత్ మీటర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాణహిత పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, మత్స్యకారులు ఎవరు చేపల వేటకు వెళ్లకూడదన్నారు. పిల్లలు, యువకులు సెల్ఫీల కోసం వరద ప్రాంతాలకు వెళ్లకూడదని తెలిపారు. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో ఆ వైపు ప్రజలు వెళ్లకుండా పోలీసులను వంతెనాల వద్ద నియమించడం జరిగిందన్నారు. ప్రజలు కూడా పోలీసుల సూచనలను పాటించాలని కోరారు. అత్యవసరమైతేనే ఇంట్లో నుండి బయటకి వెళ్లాలని, ఏదైనా సహాయం అవసరమైతే పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నాను.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

పెంచికల్‌పేట్ : కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు వచ్చిన వారు రైతు బీమాలో పేరు నమోదు చేసుకోవాలని పెంచికల్‌పేట్ ఏఓ రాజులనాయుడు ఒక ప్రకటనలో కోరారు. నూతన పట్టా పాస్ పుస్తకం వచ్చి 18 నుండి 59 సంవత్సరాల మధ్య వయసు గల రైతులు సంబంధిత వ్యవసాయ అధికారిని సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

నేడు గద్దరన్న సంస్మరణ సభ సన్నాహక సమావేశం

కాగజ్‌నగర్ : ప్రజా, ఉపాధ్యాయ, కార్మిక, విద్యార్థి సంఘాల ఐక్యవేదిక, తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 11న నిర్వహించనున్న ప్రజా యుద్ధనౌక గద్దరన్న సంస్మరణ సభ సన్నాహక సమావేశం ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తిగలవారు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వరద పరిస్థితుల దృష్ట్యా ప్రత్యేక రక్షణ చర్యలు

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-కెరమెరి

వరద పరిస్థితుల దృష్ట్యా ప్రజల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శనివారం మండలంలోని అనార్‌పల్లి, సాంగ్వి గ్రామాలను సందర్శించి గ్రామాలల్లో వరద పరిస్థితులు, చేపట్టాల్సిన చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో నదులు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ఈ క్రమంలో పోలీస్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమన్వయంతో నదులు, కల్వర్టులు, వాగుల వద్దకు ప్రజలు వెళ్లకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వరదల కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడే గ్రామాలలో గర్భిణులను గుర్తించి సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తమ పరిధిలో ఇండ్లను సందర్శించి సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాలని తెలిపారు. ప్రజల సహాయార్థం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి అంజత్ పాషా, ఎస్సై విజయ్ కుమార్, అధికారులున్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
ఆదివారం | జులై 21, 2024 | www.navatelangana.com

చింతగూడలో అక్షరాభ్యాసం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని చింతగూడ అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ బాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా నూతన విద్యావిధానం, పాఠ్య ప్రణాళికపై వివరించారు. 3 నుంచి 6ఏళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని, ప్రయివేటుకు ధీటుగా ఆటపాటలతో పిల్లలకు ప్రీస్కూల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ మంతెన రమేశ్, పాఠశాల హెచ్‌ఎం రమేశ్, అంగన్‌వాడీ టీచర్ పల్లవి, వీఓ లీడర్లు గేడం సుజాత, మడావి శశికళ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో గైనకాలజిస్టును నియమించాలి

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోతు విజయ



నవతెలంగాణ-జన్నారం

మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించి ఆస్పత్రిలో గైనకాలజిస్టును నియమించేలా చూడాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ను ఐద్వా జిల్లా అధ్యక్షురాలు విజయశంకర్ కోరారు. శనివారం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ నిర్వహించిన డైల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు ఫోన్ చేసి మండలంలో నెలకొన్న పలు సమస్యలను ఆమె ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రాత్రి 8 గంటలకు నిర్మల్ నుంచి జన్నారంకు బస్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను త్వరలో పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పోతు విజయ తెలిపారు.

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే రహదారికి ఇరుప్రక్కల జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, నస్పూర్ పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్‌తో కలిసి హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని, భావితరాలకు మంచి వాతావరణం అందించాలని అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య మంచిర్యాల రాజస్వ మండల అధికారి రాములు, నస్పూర్ మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, మంచిర్యాల, నస్పూర్ మండలాల తహసీల్దార్లు రమేష్, శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ళ వేణు పాల్గొన్నారు.

వచ్చే అసెంబ్లీలో సమావేశాల్లో బీసీల సమస్యలు ప్రస్తావించాలి



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ అసెంబ్లీలో బీసీల సమస్యలను బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రస్తావించాలని బీసీ కులాల ఐక్య ఉద్యమ పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ చంద్రయ్య కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు 23 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో 21 మంది బీసీ ఎమ్మెల్యేలు ఇద్దరూ బీసీ మంత్రులు బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల ప్రస్తావనకు కృషి చేయాలన్నారు. అలాగే చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ల పెంపు ప్రస్తావన తేవాలని సూచించారు. బీసీ కుల ఘనన చేపట్టే విధంగా అసెంబ్లీలో ప్రస్తావన తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోకన్వీనర్ కడార్ల నరసయ్య, దోనోజు శ్రీనివాస్ వేమునూరు శేఖర్ కొత్తపెల్లి శ్రీనివాస్, జయకర్, మందపల్లి మొగిలి కొత్తపెల్లి మొగలి, రాగి రవీందర్, ఇప్ప చంద్రయ్య, గంధోరి కిష్టయ్య రమేష్ కిష్టాపూర్, సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీలంక శేఖర్ పాల్గొన్నారు

ముత్యంపల్లి పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర స్వామి పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి పుష్పలత ఆధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఉపాధ్యాయులమంతా కృషి చేస్తున్నామని పాఠశాలలో పిల్లల నమోదు శాతం పెంచి, వంద శాతం పిల్లలు హాజరయ్యేలా తల్లిదండ్రులు తోడ్పడాలని కోరారు. ఇంటి దగ్గర పిల్లలు సెల్ ఫోన్లకు దూరంగా ఉండేలాగా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, ఇచ్చిన హోంవర్క్ చేస్తున్నారా లేదా అని తల్లిదండ్రులు పిల్లలను గమనించి శ్రద్ధ వహించాలని, పిల్లలతో తల్లిదండ్రులు కొంత సమయాన్ని కేటాయించాలని, ఇంటిలో ఒక మూల పిల్లలకు చదువుకునే ఏర్పాటుకు కొంత స్థలాన్ని కేటాయించి, గాలి వెలుతురు వచ్చేలా పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. 6వ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు ఇంగ్లీష్, తెలుగు, హిందీ స్పీడ్ రీడింగ్, పద్యకంఠస్తం, రాగయుక్తంగా పద్యాలు పాడుట వంటి నైపుణ్యాలను తల్లిదండ్రుల ముందు ప్రదర్శించారు. విద్యార్థుల చదువు పట్ల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల అభివద్ధి కొరకు అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో సహకారం అందిస్తామని తల్లిదండ్రులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ భారతి, కమిటీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు బండ శాంకరి, కృష్ణ గోపాల్, జ్యోతి, మాధవి లత, తిరుపతి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

25న మేకల మార్కెట్ బహిరంగ వేలం

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని తీగలపహాడ్ యాదవనగర్‌లోని మేకల మార్కెట్ రుసుము వసూలునకు బహిరంగ వేలం వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను జూన్ 19న జరగవలసిన వేలం వాయిదా పడిందని, ఆ వేలం పాటను తిరిగి జులై 25వ తేదీన ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు జులై 22వ తేదీ నుంచి 24వ తేదీలలో రూ.50 వేలు కమిషనర్ అస్పూర్ మున్సిపాలిటీ పేరున బ్యాంక్ ద్వారా డిమాండ్ డ్రాఫ్ట్ తీసుకొని కార్యాలయల పనివేళల్లో నస్పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

సమస్యల వలయంలో కిష్టాపూర్ కేజీబీవీ



నవతెలంగాణ-జన్నారం

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఏర్పాటుచేసిన కిష్టాపూర్ కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆ పాఠశాలలో 250 మందికి పైగా విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో జన్నారం, దండేపల్లి, దస్తురాబాద్, కడెం మండలాలకు చెందిన పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. మండలంలోని కవ్వాల్, కామన్‌పెల్లి, దేవుని గూడా, బంగారుతండా, రూట్‌నాయక్ తండా, తలమడుగు, ధర్మారం బాదంపెల్లి, తదితర గ్రామాల నుంచి పిల్లలు అధిక సంఖ్యలో చేరుతున్నారు. కానీ ఈ పాఠశాలలో విద్యార్థులకు ఇప్పటి వరకు బ్లాంకెట్లు, చెద్దర్లు, ప్లేటు గ్లాసు, అందించలేదు. పాఠశాలకు చుట్టు ప్రహరీ గోడ ఉన్నప్పటికీ, కోతులు పాఠశాలలోపలికి వచ్చి విద్యార్థులకు సంబంధించిన సామాగ్రిని చిందర వందర చేస్తున్నాయి. ఆ ప్రహరి గోడకు అనుకొని సోలార్ ఫెన్సింగ్ వేయాలని, కిటికీలకు దర్వాజలకు ఇనుప జాలీలు బిగించాలంటున్నారు. అలాగే పాఠశాలలో డ్రైనేజీ లేక, మురుగునీరుతో కంపు కొడుతోందని విద్యార్థులు వాపోతున్నారు. డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలంటున్నారు. కస్తూర్బా విద్యాలయంలో వాటర్‌ఫిల్టర్ చెడిపోయింది. పాఠశాలలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ లేక జన్నారం నుచి ప్యూరిఫైయర్ వాటర్‌ను కొనుగోలు చేయడంతో అప్పుడప్పుడు ఇబ్బంది తలెత్తుతున్నాయి. పాఠశాలలో ఎన్నో ఏళ్లగా సెప్టిక్ ట్యాంక్ పూర్తిగా నిండిపోయింది. విద్యార్థుల అలర్ట్ కోసం ఒక సైరన్ ఏర్పాటుచేయాలి. విద్యాలయం చుట్టుపక్కల పొలాలు పంటచేన్లు ఎక్కువగా ఉండడంతో దోమల వ్యాప్తి చెంది విద్యార్థులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. విద్యాలయంలో మంచి బోధన ఉన్నప్పటికీ ఈ సమస్యలతో ఆ విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్నారు. ఈ సమస్యలను తీర్చి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆ పాఠశాల విద్యార్థులు అధికారులను కోరుతున్నారు.

సమస్యలన్నీ ప్రభుత్వానికి నివేదించాం : హెచ్‌ఓ శ్రీవాణి



కేజీబీవీ విద్యాలయంలో విద్యాబోధన సక్రమంగా ఉన్నప్పటికీ సమస్యలు చాలానే ఉన్నాయని, వాటన్నిటిని లిస్ట్ అవుట్ చేసుకుని మంచిర్యాల జిల్లా అధికారులకు నివేదించాం. అధికారులు వెంటనే అత్యవసర సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించి విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలి.

కరపత్రాలు పంచిన వ్యక్తుల అరెస్టు



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలో జులైన 2న అర్ధరాత్రి మార్కెట్ ఏరియాలో మంచిర్యాల ఎమ్మెల్యే అండ చూసుకొని పలువురు రెచ్చిపోతున్నారని పేర్కొంటూ కరపత్రాలు దుకాణాల్లో వేసిన నిందితులను మంచిర్యాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్ వివరాలు వెల్లడించారు. మంచిర్యాలకు చెందిన మంతెన జగన్ మోహన్ రావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా మంచిర్యాల పట్టణానికి చెందిన ప్రధాన నిందితుడు రజనీష్ జైన్, కొల్లూరి భాస్కర్, సంతోష్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. రాజకీయంగా ఎదగడానికి, తన వ్యాపారాన్ని సజావుగా కొనసాగుంచలనే మంచిర్యాల ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేసినట్లు, ఎమ్మెల్యేతో పాటు తన అనుచరులపై పలు ఆరోపణలు చేస్తూ ఉత్తరాలు రాసి దుకాణాల్లో వేసినట్లు ఒప్పుకున్నారు. వారిపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. నిందితుడి వద్ద నుండి డ్రెస్, మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పారుచుకున్నట్లు తెలిపారు. గతంలోను ఈ ముగ్గురిపై భు కబ్జా కేసులు నమోదు అయినట్లు డీసీపీ పేర్కొన్నారు. సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, సీఐ బన్సిలాల్ పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయున్ని కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తునా వ్యాయామ ఉపాధ్యాయున్ని తొలగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధాగం శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ పరిధిలోని ఆక్స్ఫర్డ్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బెన్నీ పాఠశాల విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. ఇటువంటి నీచ ప్రవర్తనలకు ఒడిగాడుతున్న బెన్నీని పాఠశాల నుండి శాశ్వతంగా తొలగిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బెన్నీ అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. పాఠశాల యాజమాన్యం క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

మూడు రోజులుగా ముసురు

- చెరువుల్లోకి వచ్చి చేరుతున్న వరద నీరు



నవతెలంగాణ-జైపూర్

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటల్లోకి వర్షం నీరు వచ్చి చేరుతోంది. ఎడతెరిపి లేకుండా ఏకదాటిగా వర్షం కురుస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు అడపదడపా చిన్నపాటి చిరు జల్లులు తప్పా ఏకదాటిగా వర్షం కురిసింది లేదు. శనివారం భీమారం మండలంలో 3 సెంటీ మీటర్లు, జైపూర్ మండలంలో 4 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఫలితంగా వరి పంటలను సాగు చేస్తున్న రైతులు పంట పొలాలను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయ బోర్ల ఆధారంగా సాగు చేస్తున్న రైతులు ఇప్పటికే నారుమళ్లు సిద్ధం చేసుకోగా చెరువులు, కుంటల ఆధారంగా పంటలు సాగు చేసే రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

జలమయమైన రోడ్లు

మంచిర్యాల : మంచిర్యాల జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పట్టణంలోని పలు రోడ్లు జలమయ మయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు కంట్రోల్ రూంలను ఏర్పాటుచేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. లాంటి విపత్తులు సంభవించకుండా ఉండేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ పట్టణంలో కురిసిన కుండా పోత వర్షానికి పలు కాలనీలు జలమయమయ్యాయి. రహదురులు చెరువులను తలపించాయి. కాలనీల్లోని మురికి కాలువలు, డ్రైనేజీలు చెత్త చెదారంతో నిండి పోవడంతో వరద నిరు అంత రోడ్లపైకి వచ్చింది. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిరు వ్యాపారులకు కష్టాలు తప్పలేదు.



ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ అభినందనీయం



నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇప్పిస్తామని అనడం ఎంతో అభినందనీయమని ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీఆర్ బెంజిమెన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇప్పించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఇచ్చే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీని పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణ ఇచ్చిన అనంతరం ట్రైనింగ్ సర్టిఫికెట్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొద్దుల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి బైరీ శ్రీనివాస్, సలహాదారులు మూర్తి మండల ప్రధాన కార్యదర్శి రామస్వామి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు పెద్దన్న మల్లేష్ పాల్గొన్నారు.

సిడాం శంభు పటేల్ 6వ వర్ధంతి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ గ్రామ పంచాయతీ అవరణలోని కమ్యూనిటీ హాల్లో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివాసీ అమరుడు సిడం శంభు పటేల్ 6వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ సమాజం కోసం హక్కుల అమలు కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహనీయుడని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆదివాసీల ఆస్తిత్వం మనుగడ కాపాడుకోవాలని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయక పోడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి అదే జంగు, కాసిపేట మండల నాయక్పోడ్ సేవ సంఘం మండల అధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, ఆదివాసీ సేన ఉపాధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్, తుడుందెబ్బ మండల గౌరవ అధ్యక్షుడు ఆత్రం జంగు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-జైపూర్

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ హెచ్చరించారు. చెన్నూర్ సమీపంలో గల గోదావరి నది ఇసుక రీచ్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించిన కలెక్టర్ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల ద్వారా అందుబాటు ధరలతో ఇసుకను సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల ద్వారా నేరుగా ఇంటి వద్ద నుండే ఇసుకను అధికారికంగా పొందే అవకాశం కల్పించబడిందని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నస్పూర్

నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల సహాయార్థం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాబోవు రెండు రోజులు వర్ష సూచన ఉన్నందున వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజారక్షణ నేపథ్యంలో యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఆందోళన చెందవద్దని తెలిపారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, వరద పరిస్థితులలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామన్నారు. సహాయం కోసం కంట్రోల్ రూమ్ నెంబర్ 08736 250501, 08736 250502 లలో సంప్రదించవచ్చని, తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అక్షరాలు నేర్చుకునేది అంగన్‌వాడీలోనే

- భీమారం ఎంపీడీఓ రాధరాథోడ్

నవతెలంగాణ-జైపూర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన చిన్నారులకు పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ అక్షరాలు నేర్పించి విద్యార్థులుగా తీర్చిదిద్దాల్సింది అంగన్‌వాడీ కార్యకర్తలే అని భీమారం ఎంపీడీఓ రాధ రాథోడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేపించిన ఆమె అంగన్‌వాడీ కేంద్రం ద్వార చిన్నారులు ఉన్నత విద్యకు పునాదులు కావాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను ప్రేమతో చేర్పించి హాజరు శాతం పెంచాలని సూచించిన ఆమె చిన్నారులకు పలుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ జిల్లా కోఆర్డినేటర్ సంతోష్, సూపర్‌వైజర్ రజిత పాల్గొన్నారు.

సిడాం శంభుకు నివాళులు

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీ నాయకుడు, తుడుందెబ్బ వ్యవస్థాపకులు సిడాం శంభు 6వర్ధంతి సందర్భంగా మత్తడిగూడలో ఆయన సమాధి వద్ద బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శంభు ఆదివాసుల కోసం ఎన్నో పోరాటాలు చేశారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాడని పేర్కొన్నారు.



రిమ్స్‌లో అనస్థీషియా, ఓటీ టెక్నీషియన్స్ డే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో శనివారం అంతర్జాతీయ అనస్థీషియా, ఓటీ టెక్నీషియన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనస్థీషియా సీనియర్ డాక్టర్లు నరేందర్, హిమానీ, షెర్లిన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో యూరాలజిస్ట్ కార్తీక్ కుమార్, అనస్థీషియా టెక్నీషియన్స్ డిస్ట్రిక్ ప్రెసిడెంట్ సునీల్, సభ్యులు వెంకటేశ్, ప్రశాంత్, షఫీ, అనీష్, సాధన, మనీషా, రమ్య, ప్రసన్న పాల్గొన్నారు.



ఈవీఎం గోదాం పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్

ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేసారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, ఈడీఎం నదీం, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రావణ్‌రెడ్డి, సిరికొండ రమేష్, మజార్, గంగ్రత్ రమేష్, అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసర సమయాల్లో తప్ప బయటకు రావొద్దు : ఎస్పీ గౌస్ ఆలం

- కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- 24 గంటలూ అందుబాటులో నూతన డిడిఆర్ఎఫ్ బృందం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాకు వాతావరణ శాఖ భారీ వర్షాల నేపథ్యంలో రెడ్ అలర్ట్ సూచించిన దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. శనివారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. ప్రజలకు ఎటువంటి ప్రమాదం తలెత్తకుండా జిల్లా పోలీసు యంత్రాంగం, అధికారులు అప్రమత్తతతో విధులను నిర్వర్తిస్తుందని పేర్కొన్నారు. ఎటువంటి సమస్యలున్న అత్యవసర సమయంలో డయల్ 100కు లేదా జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 24 గంటలు అత్యవసర సమయంలో స్పందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారని, ప్రజలు 08732226246, 8712659906 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలన్నారు. నూతనంగా శిక్షణ తీసుకున్న డీడీఆర్ఎఫ్ బృందం జిల్లాలో 24 గంటలు అందుబాటులో ఉంటుందని, ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా కాపాడతారని తెలిపారు. భారీ వర్షాలు పడి వరదలు సంభవించినప్పుడు కల్వట్లు, లో బ్రిడ్జిలను, గమనిస్తూ ఉండాలని, బ్రిడ్జిలపై నుండి నీరు ప్రవహించే సమయాలలో ప్రజలు వాటిని దాటకుండా ఉండాలన్నారు. జలాశయాలు, చెరువులు, వాగుల వద్ద మత్స్యకారులు, ప్రజలు చేపల వేటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. వర్షం భారీగా ఉన్నప్పుడు పొలాలలో రైతులు విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలని, విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను కానీ చేతులతో తాకకుండా ఉండాలని సూచించారు.

పాఠశాలలో పోషకుల సమావేశం



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజురా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ చైర్మన్ జిల్కారి సాయిప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం తల్లిదండ్రుల సమావేశం ఉంటుందన్నారు. విద్యార్థులకు పాఠశాలలో ఏమైన సమస్యలు ఏర్పడితే కమిటీ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, విడిసి చైర్మన్ ప్రవీణ్, మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, ఉపాధ్యాయులు ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకరించాలి

నవతెలంగాణ-నార్నూర్

విద్యాభివృద్ధికి పోషకులు సహకరించాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మనోహర్, పవార్ బాపురావ్ కోరారు. శనివారం మండలంలోని తాడిహత్నూర్ జిల్లా పరిషత్ సెకండరీ, ఎస్సీ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో పోషకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈ ఏడాది పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత, పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత, నీటి కొరతపై చర్చించారు. పలువురు పోషకులు, పాఠశాల మాజీ చైర్మన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలో గెలుపొందేలా కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో పాఠశాల మాజీ చైర్మన్ మాధవ్, వీఓ సంగీత, గ్రామ పెద్దలు సురేష్ కేంద్రే, విశ్వనాథ్, యూత్ సభ్యులు రవీందర్, ఇరాలే గోపాల్, జాదవ్ జితేందర్, చౌహాన్ తుకారాం, జితేందర్, యువరాజ్, లవకుశ్, విజయ్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

మండలంలో 31 మిమీ వర్షం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ఏక ధాటిగా మోస్తారు వర్షం కురిసింది. 31.3మిమీ వర్షం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. మృగశిరే కార్తె ఆరంభమైనుంచి ఇదే మోస్తారు వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వాతావరణ శాఖ మరో మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని సూచనలు జారీ చేయడంతో వాగుల పరివాహక గ్రామాలైన జైత్రాం తాండా, చిత్త భట్ట, పాటగూడ, మామిడి గూడ జీ, తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో గల అంగన్వాడి కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా శనివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు రిజిష్టర్‌ను పరిశీలించి, అంగన్వాడీ టీచర్ రాకపోవడంతో సీడీపీఓ, సూపర్‌వైజర్‌ను వెంటనే పిలిపించి టీచర్ ఎందుకు గైర్హాజరు అయ్యారని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి శనివారం నిర్వహించే ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అంగన్వాడి కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు ఎంత మంది ఉన్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఎంత మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు, ఇతర వివరాలతో కూడిన వారం రోజుల నివేదిక అందజేయాలని సిడిపిఓను ఆదేశించారు. అనంతరం ఏఎన్సీ రిజిష్టర్ పరిశీలించి, రిజిష్టర్‌లో ఉన్న ప్రోఫార్మా ప్రకారం అన్ని కాలమ్స్ పూర్తి చేయాలని అన్నారు. ఐరన్ మాత్రలు, స్పాట్ ఫీడింగ్, కోడిగుడ్లు, పౌష్టికాహారం, హెల్త్ చెకప్ వివరాలు అందించాలన్నారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులకు ఆరోగ్య పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా క్రమం తప్పకుండా వేయాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి నరేందర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సాధన, ఏఎన్ఎం, ఆశా వర్కర్ ఉన్నారు.



మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

నవతెలంగాణ-ఖానాపూర్

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సిఐ సైదారావు అన్నారు. శనివారం మస్కాపూర్‌లోని సీఎం రావు ఫంక్షన్ హాల్‌లో యువతకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ లేనిదే వాహనాలను నడపకూడదని సూచించారు. యువత ఉన్నత చదువులు చదివి పోటీ పరీక్షలు రాసి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. చెడు అలవాట్లకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. గంజాయి మహమ్మారికి యువత బానిసలు కావద్దని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ రైడింగ్ చేయకూడదని అన్నారు. స్మార్ట్ ఫోన్లలో అనవసరమైన లింకులను ఓపెన్ చేయకూడదని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్ లాంటి చెడు సంస్కృతిని మానుకోవాలని, స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లింబాద్రి పాల్గొన్నారు.



ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థినులు ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆకాంక్షించారు. శనివారం ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావుతో కలిసి జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని ఆదేశించారు. వసతి గృహంలో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థినులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు నిలబెట్టాలన్నారు. అనంతరం విద్యార్థినులకు నోట్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అవసరమైతేనే ప్రజలు బయటకు రావాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు
- అడ ప్రాజెక్టు వరద పరిస్థితి పరిశీలన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారీ వర్ష సూచన నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు అవసరమైతేనే తప్ప బయటకి రావాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. అడ ప్రాజెక్టుకు పెరుగుతున్న ఇన్ ఫ్లో నేపథ్యంలో పరిస్థితి తెలుసుకునేందుకు డీఎస్పీ సదయ్యతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. ఇరిగేషన్ ఈఈ గుణవంతురావు, డీఈ దామోదర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులోకి వచ్చే వరద నీరు పెరుగుతుందని దీనితో అధికారులు నీటిని కిందికి వదులుతున్నారని తెలిపారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అవసరమైతేనే ఇండ్లలో నుండి బయటకు రావాలని సూచించారు. పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటున్నారని ఎక్కడ ఎటువంటి సంఘటన జరిగిన పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఐలు సతీష్, శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ గంగన్న పాల్గొన్నారు.

బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గోలేటి జీఎం ఆఫీస్ ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం బెల్లంపల్లి ఏరియా జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను ఆపి సింగరేణికి కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని వేయడాన్ని వెంటనే మానుకోవాలని క్యాపిటల్ విధానంలో తెలంగాణ బొగ్గు బ్లాకులు తెలంగాణకు ఇవ్వాలని, మూడోసారి గెలిచిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్మిక వ్యతిరేక విధానాలను చేపట్టి కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసే విధంగా దొంగ చట్టాలను రూపొందిస్తుందని ఆరోపించారు. రాష్ట్రం నుండి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలుండి కూడా బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకోలేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్లయం వల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, టీఎస్‌యూఎస్, ఏఐఎఫ్‌టీయూ,టీఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.



భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

నవతెలంగాణ-నిర్మల్

భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డా.జానకి షర్మిల శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాగల 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా పోలీస్ యంత్రంగాన్ని అప్రమత్తం చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని సూచించారు. పోలీసు యంత్రాంగం, శిక్షణ పొందిన పోలీస్ బృందం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి లేదా కంట్రోల్ రూమ్ 8712659555కు ఫోన్ చేసి పోలీసు సహాయం పొందాలని తెలిపారు. జిల్లా ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలు పోలీసు వారి సూచనలు సలహాలు పాటిస్తూ సహకరించాలన్నారు. స్వర్ణ, కడెం, గడ్డెన్న వాగు ప్రాజెక్టు పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు వంకలు పొంగి పొర్లె అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజల భద్రతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని వాటి వద్దకు వెళ్లావద్దని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్లరాదని సూచించారు. జలాశయాలు, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని సూచించారు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని, వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలను, వైర్లను చేతులతో తాకవద్దని సూచించారు. చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదని. విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్ ముట్టుకోరాదని సూచనలు చేశారు.

నవంబర్‌లోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- ఏటీసీ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను (ఏటీసీ) నిర్మాణ పనులను కలెక్టర్ రాజర్షి షా పరిశీలించి నవంబర్‌లోగా పూర్తి చేయాలన్నారు. శనివారం వర్షం పడుతున్నప్పటికి వర్షంలోనే కేంద్రాన్ని సందర్శించి నిర్మాణ పనులపై ఆరా తీశారు. ఇంజినీరింగ్ అధికారులను పనులు ఎంతవరకు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 65 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు మంజూరయ్యాయని ఇందులో ఆదిలాబాద్‌లో ఒకటి, ఉట్నూర్ ఒకటి మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఒక సెంటర్‌కు రూ.4 కోట్ల 76 లక్షల బడ్జెట్‌ను కేటాయించినట్లు తెలిపారు. ఈ టెక్నాలజీ సెంటర్‌లో కొత్తగా ఆరు కోర్సులు ప్రవేశపెట్టడం జరుగుతుందని, 6 కోర్సులకు గాను 122 సీట్లు, 12 యూనిట్లుగా ఉంటాయని వివరించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్మాణ పనులను చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు సిబ్బంది ఉన్నారు.

సొంత జిల్లాలకు బదిలీ చేయాలి

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని కౌటాల, తలోడి, బోధన్‌పల్లి, ముత్తం పేట వివిధ పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎంఎల్ రాజు, సునార్‌కర్ గణపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ 317 ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా దాదాపు 608 మంది ఉపాధ్యాయులు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు 2021 సంవత్సరంలో కేటాయించబడ్డారని తెలిపారు. ఫలితంగా వారు సొంత జిల్లాను వదిలి స్థానికతను కోల్పోయి ఆసిఫాబాద్ జిల్లాలో వివిధ మండలాల్లో పనిచేస్తున్నారన్నారు. వివిధ కమిటీలతో కాలయాపన చేయకుండా ఎన్నికల ముందు ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఎలాంటి షరతులు విధించకుండా స్థానికత ఆధారంగా 317 జీఓ ద్వారా వచ్చిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు బకాయిలు ఉన్న విద్యుత్ బిల్లులను చెల్లించాలని డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారని, వాటిని వెంటనే రద్దుచేసి కరెంటు బిల్లులను బకాయిలను మాఫీ చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ఉచిత కరెంటు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, మార్తా రమేష్, జాటోత్ సంతోష్, నాగమణి, పద్మావతి, రాజేంద్రప్రసాద్, యుఎన్ చారి, కవిత, సంధ్యారాణి, ప్రధానోపాధ్యాయులు నారాయణ సింగ్, అరుణ్ కుమార్, గోడం హనుమంతు, రామచందర్, సత్యనారాయణ శైలజ పాల్గొన్నారు.

ఇంటింటికి మొక్కల పంపిణీ

నవతెలంగాణ-మందమర్రి

సదా సేవ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సదా సేవ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సంఘీ సంతోష్ మాట్లాడుతూ మొక్కలను నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా కాలుష్యాన్ని నివారించడానికి ఎంతో దోహతపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సుద్దాల జనార్ధన్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి వినయ్ కృషి అభినందనీయం

నవతెలంగాణ-జన్నారం

మండల అభివృద్ధికి మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కృషి చేశారని చింతగూడ గల్ఫ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జక్కుల లక్ష్మణ్ అన్నారు. మండల వైస్ ఎంపీపీగా వినయ్ పదవి కాలం ముగియడంతో శనివారం చింతగూడ గ్రామంలోని గల్ఫ్ అసోసియేషన్ భవన్‌లో అతనికి శాలువా పూలమాలతో సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ చింతగూడ గ్రామంలో గల్ఫ్ అసోసియేషన్ భవన నిర్మాణానికి తన సహకారం అందించారన్నారు. భవిష్యత్తులో కూడా గల్ఫ్ మిత్రులకు అండగా ఉండాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ అసోసియేషన్ క్యాషియర్ అరె లింగమూర్తి, అకౌంటెంట్ బాధవత్ రాజ్యానాయక్, అరె యుగేందర్, ములుమూరి నగేష్, సిపతి రవీందర్, పానగంటి శ్రీనివాస్, చిర్నొని సురేష్, అక్కవాత్తుల చందు, నాగుల రాజన్న, అయితే సత్యం, నాసాని నగేష్, పురంశెట్టి కిరణ్ పాల్గొన్నారు.

సేవా భావం కలిగి ఉండడం అభినందనీయం

నవతెలంగాణ-జన్నారం

సేవా భావం కలిగి ఉండడం అభినందనీయమని మండలంలోని కలమడుగు జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి అన్నారు. శనివారం ఆ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు, ఆశాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగులు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలన్నారు. ప్రతి విద్యార్థి సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆశాజ్యోతి ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, రాజేందర్, కవిత, సాగర్, తిరుపతి, నరసయ్య, కొండ గొర్ల లక్ష్మయ్య, సింధు, జోష్న పాల్గొన్నారు.

21న తండాల్లో గురు పౌర్ణిమ వేడుకలు

నవతెలంగాణ-ఉట్నూర్

తండాల్లో 21న గురుపౌర్ణిమ వేడుకలను నిర్వహించుకోవాలనీ లైవ్ ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ జాదవ్ వినోద్ ఒక్క ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం తాండల్లో భోగ్ భండర్, జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా చేసుకోవాలని సూచించారు. లంబాడీల ఉద్యోగ, కార్మిక నాయకులు, గ్రామ పెద్దలు సకాలంలో రావాలన్నారు.